

అయితే.. మాకేంటీ?

- పైసలొచ్చే పనులకే మొగ్గు... కనీస సౌకర్యాలు వద్దు
- జిల్లాలో రూ.74 కోట్లతో ఈజీఎస్ పనులు
- రూ.72 కోట్లు సీసీ రోడ్లకే..
- 'మురికి'కూపాలుగా గ్రామాలు 7



గోదావరి జలాలతో హల్దీ్ర పరవళ్లు

కొండపోచమ్మ ప్రాజెక్టు ద్వారా రెండు రోజుల క్రితం వదిలిన గోదావరి జలాలు సోమవారం నాచగిరి క్షేత్రంలోని హల్దీ్ర నదికి చేరుకున్నాయి. దీంతో నది మత్తడి పై నుంచి నీళ్ల పరవళ్లు తొక్కుతున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా క్షేత్రానికి వచ్చిన భక్తులు పవిత్ర హల్దీ్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. నాచగిరి లక్ష్మీనృసింహ్మస్వామి క్షేత్రంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. నదిలో నీళ్ల లేకపోవడంతో భక్తులు, ఆలయ అధికారుల విన్నపం మేరకు నీటిని విడుదల చేశారు.

- వర్గల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి)

శ్రీరామనవమి ఏర్పాట్లపై జగ్గారెడ్డి సమీక్ష

సంగారెడ్డి రామ్‌మందిర్‌కు రంగులు, భారీ లైటింగ్, సౌండ్ సిస్టం



సంగారెడ్డి రామ్‌మందిర్ వద్ద శ్రీరామనవమి ఏర్పాట్లపై సమీక్షిస్తున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రానున్న శ్రీరామనవమి వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సమీక్ష నిర్వహించారు. సంగారెడ్డిలోని పురాతనమైన రామ్‌మందిర్ ఆలయంతో పాటు రామ్‌మందిర్ కమాన్, దిడ్డిగౌని కమాన్‌కు రంగులు వేయించాలని సూచించారు. ఆలయంలో వెలుగులు విరజిమ్మేలా భారీ లైటింగ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. శ్రీరామకల్యాణం మార్మోగేలా పట్టణమంతా సౌండ్‌సిస్టం ఉండాలన్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:34 (మంగళవారం సాయంత్రం)

సహర్: 4:54 (బుధవారం ఉదయం)

తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నింపాలి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చేర్యాల, మార్చి 24(ఆంధ్రజ్యోతి): దేవాదుల ద్వారా తక్షణమే పంపింగ్ చేపట్టి కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో నింపాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిజర్వాయర్‌ను సకాలంలో నింపకపోవడంతో చేర్యాల ప్రాంతంలో పంటలు ఎండుతున్న విషయమై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో "తపాస్‌పల్లికి నీళ్లొచ్చేనా..." శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ విషయమై అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా జీరో అవర్‌లో ఎమ్మెల్యే పల్లా మాట్లాడారు. గోదావరిలో పుష్కలంగా నీళ్లుండి.. నిల్వ చేసుకోవడానికి అనువైన రిజర్వాయర్లు ఉన్నప్పటికీ కేవలం మోటార్లు ఆన్ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. గతంలో రెండు పంటలు పండాయని, కాంగ్రెస్ హయాంలో కేవలం పంపింగ్ చేయకపోవడంతో 50 శాతం పైగా పంటలు ఎండిపోయాయన్నారు. సమ్మక్క-సాగర్‌నుండి భీంఘన్‌పూర్, చలివాగు, ధర్మసాగర్ మీదుగా నాలుగు పంపుల ద్వారా తపాస్‌పల్లికి నీళ్లు వస్తాయని, వెంటనే ఆ నాలుగు పంపులు ఆన్‌చేస్తే మిగతా 50శాతం పంటలైనా కాపాడుకోవచ్చన్నారు. మల్లన్నసాగర్ నుంచి తపాస్‌పల్లికి గ్రావిటీ ద్వారా నీటిని మళ్లించేందుకు రూ.350కోట్లు నిధులు మంజూరై పనులు చేపట్టినప్పటికీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిలిచిపోయాయన్నారు. కొంతమేర పెండింగ్ పనులు పూర్తిచేస్తే రిజర్వాయర్‌కు నీరు పుష్కలంగా చేరుతాయని, తద్వారా ఆయకట్టు విస్తీర్ణానికి న్యాయం చేకూరుతుందన్నారు. చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రి, ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ భవనం పనులు నిలిచిపోయాయని, నిధులు అందిస్తే చేర్యాల ప్రాంత ప్రజలకు వైద్య, పరిపాలన అవసరాలు తీరతాయన్నారు.

కమలాయపల్లి, అర్జునపట్ల గ్రామాలు ఇక చేర్యాలలో

సుమారు నాలుగున్నరేళ్లుగా కేవలం చేర్యాల రెవిన్యూపరిధిలో విలీనమైన కమలాయపల్లి, అర్జునపట్ల గ్రామాలు ఇక పూర్తిస్థాయి పంచాయతీరాజ్‌పరిధిలో కొనసాగనున్నాయి. ఈమేరకు సోమవారం అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందింది. రెండు గ్రామాల పేర్లు బిల్లు ప్రసంగ ప్రస్తావనలో తెలపకపోవడాన్ని ఎమ్మెల్యే పల్లా లేవనెత్తారు. దీంతో పంచాయత్‌రాజ్‌శాఖ మంత్రి సీతక్క స్పందించి రెండు గ్రామాలను చేర్యాలలో పూర్తిస్థాయి విలీనమయ్యాయని, రానున్న పంచాయతీ ఎన్నికలు చేర్యాల పరిధిలో కొనసాగుతాయని స్పష్టం చేశారు.

శునకం దాడిలో చిన్నారికి గాయాలు



జగదేవ్‌పూర్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): శునకం దాడిలో చిన్నారికి తీవ్రగాయాలైన సంఘటన సోమవారం సాయంత్రం జగదేవ్‌పూర్‌లో చోటుచేసుకుంది. జగదేవ్‌పూర్‌లోని దౌలాపూర్ రోడ్డులో నివాసం ఉంటున్న సుష్మ, బస్వరాజ్ దంపతుల కుమార్తె సానిధ్య స్థానిక ప్రైవేట్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతుంది. మధ్యాహ్నం పాఠశాల నుంచి ఇంటికి వచ్చి ఆడుకుంటుండగా కుక్క దాడి చేసింది. అంతకు ముందు వృద్ధురాలిని కరవడానికి వెళ్లగా వృద్ధురాలిని కర్రతో కొట్టడంతో పరుగు తీసిన కుక్క చిన్నారిపై దాడి చేసింది. దాడిలో సానిధ్య తీవ్రంగా గాయపడింది. వెంటనే కుటుంబ సభ్యులు గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు.

సెక్రటరీలు కావలెను

"సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి వెంకటయ్యకు నంగునూరు, బెజ్జంకి, హుస్నాబాద్ మార్కెట్ల బాధ్యతలు కూడా అప్పగించారు. జిల్లాలోనే పెద్దదైన సిద్దిపేట మార్కెట్‌లోనే తీవ్రమైన పని ఒత్తిడి ఉంటుంది. ఇది చాలదన్నట్లు 40 కి.మీ.ల దూరంలో ఉన్న హుస్నాబాద్, 20 కి.మీ.ల దూరంలో ఉన్న బెజ్జంకి, నంగునూరు మార్కెట్లను పర్యవేక్షించడం తలకుమించిన భారంగా పరిణమించింది. నాలుగు మార్కెట్లు అప్పగించడంతో ఇటు కార్యదర్శికి.. అటు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

"మెదక్ వ్యవసాయ మార్కెట్ సూపర్‌వైజర్ ఈశ్వర్‌కుమార్‌కు రామాయంపేట గ్రేడ్-3 మార్కెట్, పాపన్నపేట మార్కెట్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మెదక్ మార్కెట్‌తోనే సరిపోతుందంటే అదనంగా మరో రెండు మార్కెట్ల బాధత్యలు కేటాయించడంతో దేనికీ న్యాయం చేయలేకపోతున్నారు.

"సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇన్‌చార్జి కార్యదర్శిగా మహమూద్ కొనసాగుతున్నారు. ఆరేళ్లుగా ఇక్కడ ఇన్‌చార్జి పాలనే నడుస్తుండటంతో పూర్తిస్థాయి అధికారిని నియమించాలనే విన్నపాలున్నా పట్టించుకోవడం లేదు. జిల్లాలో మరో ప్రధానమైన వట్‌పల్లి మార్కెట్‌కు కూడా రెగ్యులర్ కార్యదర్శి లేకపోవడం గమనార్హం.

వ్యవసాయ మార్కెట్లలో ఇన్‌చార్జిల పాలన



తూప్రాన్ వ్యవసాయ మార్కెట్

- ఒక్కో కార్యదర్శికి నాలుగు మార్కెట్ల బాధ్యతలు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో పడకేసిన పాలన
- పంట ఉత్పత్తులపై కొరవడుతున్న పర్యవేక్షణ

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 24: రైతులు పండించిన ఉత్పత్తులను సేకరించే వ్యవసాయ మార్కెట్లపై పర్యవేక్షణ కొరవడింది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని ప్రధాన మార్కెట్లు సైతం ఇన్‌చార్జిల పాలనలో కొనసాగుతున్నాయి. ఒక్కో సెక్రటరీకి నాలుగేసి మార్కెట్ల బాధ్యతలు అప్పగించి సతమతం చేస్తున్న పరిస్థితి నెలకొంది. కొన్ని సందర్భాల్లో కార్యదర్శులు ఎటూ న్యాయం చేయలేకపోతున్నారనే వాదన వినిపిస్తోంది.

ముగ్గురి చేతుల్లో 11 మార్కెట్లు

సిద్దిపేట జిల్లాలోని వ్యవసాయ మార్కెట్లలో విచిత్ర పరిస్థితి దాపురించింది. వ్యవసాయ ఉత్పత్తుల పరంగా ఈ జిల్లా ముందువరుసలోనే ఉంటుంది. దాదాపు అన్ని మార్కెట్లూ ఆయా కాలాల్లో పంట ఉత్పత్తులతో కళకళలాడుతుంటాయి. అయితే ఉత్పత్తులకు తగినట్లుగా మార్కెట్లలో పర్యవేక్షణ కరువైంది. రెగ్యులర్ సెక్రటరీలు ఉన్నట్లయితే ఎప్పటికప్పుడు రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకుంటారు. పంట కొనుగోళ్లలో దళారుల ప్రమేయాన్ని నియంత్రిస్తారు. కానీ ఇన్‌చార్జిల పాలన ఉండడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. సిద్దిపేట మార్కెటింగ్ శాఖ అధికారిగా ఉన్న నాగరాజుకు అదనంగా చిన్నకోడూరు, కొండపాక, కోహెడ, చేర్యాల వ్యవసాయ మార్కెట్ల ఇన్‌చార్జి కార్యదర్శిగా బాధ్యతలిచ్చారు. ఇక వెంకటయ్య చేతుల్లో సిద్దిపేట, నంగునూరు, బెజ్జంకి, హుస్నాబాద్, జాన్‌వెస్లీకి గజ్వేల్, మిరుదొడ్డితోపాటు మెదక్ జిల్లాలోని తూప్రాన్ మార్కెట్లు ఉన్నాయి. ముగ్గురి చేతుల్లోనే 11 వ్యవసాయ మార్కెట్లు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు.

ఒక్కో మార్కెట్‌లో ఒక్కో పరిస్థితి

మెదక్ జిల్లా తూప్రాన్ మార్కెట్ ఉన్నట్లా.. లేనట్లా అన్నట్లుగా తయారైంది. ఇక్కడ రెగ్యులర్ కార్యదర్శిని నియమించలేదు. గజ్వేల్ మార్కెట్ కార్యదర్శి ఇక్కడ ఇన్‌చార్జిగా ఉన్నారు. అటెండర్, వాచ్‌మన్ లేక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో నెట్టుకొస్తున్నారు. జోగిపేట మార్కెట్ కార్యదర్శిగా ఉన్న సునిల్‌ను వట్‌పల్లి ఇన్‌చార్జిగా నియమించారు. జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్, సంగారెడ్డి నియోజకవర్గాల వ్యాపార ఉత్పత్తులతో సంబంధాలున్న వట్‌పల్లికి రెగ్యులర్ కార్యదర్శి లేకపోవడం విడ్డూరమే. ఇక సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ వ్యవసాయ మార్కెట్‌కు మూడేళ్ల నుంచి రెగ్యులర్ కార్యదర్శి లేకపోవడంతో జహీరాబాద్ కార్యదర్శి వీరిశెట్టి ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. నారాయణఖేడ్ వంటి మారుమూల ప్రాంతాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సిద్దిపేట జిల్లా వంటిమామిడి మార్కెట్‌కు పెద్ద ఎత్తున కూరగాయలు తెస్తారు. ఇక్కడ కూడా రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ సెక్రటరీ రేవంత్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

పాపం.. పండుటాకులు

- పిల్లలు చూసుకోవడం లేదని ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వృద్ధులు



కార్ల నర్సమ్మ

సిద్దిపేట కలెక్టరేట్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): "మాది రాయపోల్ మండలంలోని మంతూరు గ్రామం. నాకు 78 సంవత్సరాలు. నా భర్త చనిపోయాడు. నాకు ఆరు ఎకరాల భూమి, ఇతర ఆస్తులు ఉన్నాయి. నాకు ఇద్దరు కుమారులు. వారు ఆలనా పాలన చూసుకుంటారని నా పేరు మీద ఉన్న ఆరెకరాల భూమి ఇతర ఆస్తులను నా కుమారులకు రిజిస్ట్రేషన్ చేయించాను. ఇప్పుడు నన్ను చూసుకునే నాథుడే కరువయ్యాడు. నాకు అన్నం పెట్టకుండా.. నన్ను కొట్టడం తిట్టడం చేస్తున్నారంటూ" రాయపోల్ మండలం మంతూరుకు చెందిన కార్ల నర్సమ్మ ప్రజావాణిలో కలెక్టర్ ముందు కన్నీటిపర్యంతమయ్యారు.



సక్కుబాయి

"నా కొడుకుకు ఏ చిన్నకష్టం రాకుండా చూసుకుంటే నన్నే ఇంటి నుంచి గెంటేశారు సారు. ఇప్పుడు నేను నడవలేని స్థితిలో ఉన్నా. నా ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. నన్ను బాగా చూసుకుంటారని కోడలు పేరు మీద సిద్దిపేటలో ఉన్న 120 గజాల ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇప్పుడు ఎవరూ చూసుకోవడం లేదు. నన్ను చూడని వారికి నా ప్లాట్ ఎందుకు. ఆ రిజిస్ట్రేషన్ రద్దు చేసి మరలా నా పేరు మీదకు వచ్చేలా న్యాయం చేయండి" అంటూ సిద్దిపేటకు చెందిన మొరం శెట్టి సక్కుబాయి ప్రజావాణిలో కలెక్టర్ ఎదుట బోరున విలపించింది.

వీరిద్దరే కాదు ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణికి వచ్చే వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. పిల్లలు సరిగా చూసుకోవడం లేదని, తిండి పెట్టడం లేదని, ఆస్తులు లాక్కుని సరిగా చూడడం లేదంటూ ఇలా అనేక ఫిర్యాదులు వస్తున్నాయి.

ప్రజావాణికి 71 దరఖాస్తులు

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి దోహదపడుతుందని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం ద్వారా జిల్లా అదనపు కలెక్టర్లు గరీమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్‌తో కలిసి ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో భూ సంబంధిత, హౌసింగ్, ఆసరా పింఛన్ల ఇతర అర్జీలు మొత్తం 71 వచ్చాయని ఆయన తెలిపారు.

గజ్వేల్ దశ మార్చిన ఘనత కేసీఆర్‌దే

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

గజ్వేల్, మార్చి24 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్‌ను రాష్ట్రానికి ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌దేనని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. గజ్వేల్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... గతంలో గజ్వేల్ అంటే కక్షలు, కుట్రలు, పోలీస్ కేసులు, భౌతికదాడులు ఉండేవని, కానీ కేసీఆర్ వచ్చాక ప్రేమ గజ్వేల్‌గా మారిందన్నారు. నాడు నీళ్ల కోసం తిప్పలు పడ్డ గజ్వేల్‌లో నీటికొరత లేకుండా చేశారని, ప్రస్తుతం మళ్లీ నీటి సమస్య వస్తుందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి దరిద్రపు పాలన వల్ల గజ్వేల్‌లో రియల్ వ్యాపారం దెబ్బతిన్నదని, ధనలక్ష్మి పారిపోతుందన్నారు. గజ్వేల్‌కు కేసీఆర్ మధ్య తల్లిపిల్లల బంధం ఉందని, దానిని ఎవరూ విడదీయలేరన్నారు. 15 నెలల కాంగ్రెస్ పాలనలో మైనార్టీలకు మంత్రి పదవిని ఇవ్వలేదని, రంజాన్ తోఫాను బంద్ పెట్టారని హరీశ్‌రావు విమర్శించారు. గజ్వేల్‌లోని మదీనా మజీద్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఆయన మాట్లాడారు. గతంలో ఇద్దరు మంత్రులను కేసీఆర్ నియమిస్తే అందులో ఒక్కరు మైనారిటీ మంత్రి ఉన్నారని, కానీ నేటి ప్రభుత్వంలో మైనార్టీలకు స్థానం లేదని, మైనార్టీలు తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదన్నారు. ఆయన వెంట ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, నాయకులు శ్రీనివాస్, ప్రశాంత్, నూనెకుమార్, అంజిరెడ్డి, బెండే మధు, నవాజ్‌మీరా, బాలమణి, రజిత, అత్తెల్లి శ్రీనివాస్, కనకయ్య, బాలేష్, చందు, హన్మంత్‌రెడ్డి, ప్రశాంత్, అహ్మద్ ఉన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ మంత్రి హరీశ్‌రావు



అగ్నిగుండాలకు పూజ, బలిహరణ అనంతరం అగ్నిగుండాలు దాటడం ప్రారంభిస్తున్న అర్చకులు

వెళ్లొస్తాం..మల్లన్నా

వచ్చేయేడు మళ్లొస్తాం.. ఘనంగా కొమురవెల్లి మల్లన్న అగ్నిగుండాలు

- వీరశైవుల జగద్గురు బర్దిపూర్ దత్తగిరిపీఠం మహామండలేశ్వర డాక్టర్ సిద్దేశ్వరానందగిరి రాక
- నిప్పుల్లో చిందేసిన భక్తులు, శివసత్తులు
- ముగిసిన మూడు నెలల జానపదుల జాతర



చేర్యాల, మార్చి 24 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా సోమవారం తెల్లవారుజామున అగ్నిగుండాలను అత్యంత భక్తిప్రపత్తులతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం అర్ధరాత్రి అనంతరం తోటబావి ప్రాంగణంలో ఐదురకాల వంటచెరుకును అమర్చి అగ్నిగుండాలను తయారుచేశారు. వీరశైవుల జగద్గురు బర్దిపూర్ దత్తగిరి పీఠం మహామండలేశ్వర డాక్టర్ సిద్దేశ్వరానందగిరి మహాస్వామి పర్యవేక్షణలో వీరశైవాగమశాస్త్రం ప్రకారం శాస్త్రోక్తయుక్తంగా, సంప్రదాయబద్ధంగా నిత్యార్చనలు, మహాగణపతి పూజ, ఋత్విగ్వరణం, స్వస్తిపుణ్యహవాచనం, నాంది సమారాధాన, ఏకాదశరుద్రపూజ, సప్తమాతృకపూజ, జగద్గురు పంచాచార్య పూజ, వీరభద్ర పళ్లెరం, భద్రకాళి పూజ,

మిగతా 7వ పేజీలో

తూప్రాన్ విద్యుత్ సబ్ డివిజన్‌కు వాహనం



వాహనానికి పూజలు

తూప్రాన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లి శివారులో విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయానికి ఇసూజీ వాహనం కేటాయించినట్లు విద్యుత్ డీఈ గరత్ మంత్‌రావు తెలిపారు. తూప్రాన్ విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని తూప్రాన్, కాళ్లకల్ (మనోహరాబాద్), శివ్వంపేట, వెల్దుర్తి, మాసాయిపేట సెక్షన్లలో పనులకు ఉపయోగించేందుకు ఇసూజీ వాహనం అందజేశారు. నాచగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో తూప్రాన్ విద్యుత్ డీఈ గరత్‌మెంత్ రావు, ఏడీఈ శ్రీనివాస్, ఏఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నర్సాపూర్ తైబజార్ వేలం రూ.30.10 లక్షలు

నర్సాపూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో తైబజార్ వేలం పాటలో రూ.30.10 లక్షలకు సందీప్ దక్కించుకున్నాడు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రామకృష్ణారావు ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించగా పశువుల సంతను రూ.3.50 లక్షలకు చింతకుంట శ్రీకాంత్ దక్కించుకున్నాడు.

పేట పంచాయతీ తైబజార్ వేలం రూ.9.20 లక్షలు

పెద్దశంకరంపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేట గ్రామపంచాయతీ అభివృద్ధికి తైబజార్ వేలం ద్వారా రూ.9.20 లక్షల ఆదాయం సమకూరినట్లు మెదక్ డీఎల్పీవో సురేష్‌బాబు తెలిపారు. సోమవారం పెద్దశంకరంపేటలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో తైబజార్ వేలంపాట వేశారు. పెద్దశంకరంపేటకు చెందిన పోచయ్య రూ.9.20 లక్షలకు పాట పాడి తైబజార్ దక్కించుకున్నారు.

శివ్వంపేట తైబజార్ వేలం రూ.3.42 లక్షలు

శివ్వంపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన శివ్వంపేట పంచాయతీ తైబజార్ అంగడి బహిరంగ వేలం సోమవారం ప్రత్యేక అధికారి కమలాద్రి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి రమాదేవి సమక్షంలో నిర్వహించారు. శివ్వంపేట గ్రామానికి చెందిన సురేష్ రూ.3.42 లక్షలకు దక్కించుకున్నాడు.

నేడు అల్లాదుర్గం తైబజార్ వేలం

అల్లాదుర్గం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 25న అల్లాదుర్గం తైబజారు వేలం పాటను నిర్వహిస్తున్నట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి కే.ప్రభాకర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించే వేలంలో ఆసక్తి గలవారు రూ.5 వేలు చెల్లించి పాల్గొనాలన్నారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య



అనిల్‌కుమార్(ఫైల్), నర్సింలు(ఫైల్)

వెల్దుర్తి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : అప్పులబాధతో ఓ యువకుడు పురుగుల మందు తాగి సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెల్దుర్తి మండలం శెట్టిపల్లి గ్రామానికి చెందిన పడిగే అనిల్‌కుమార్(26) పౌల్ట్రీ ఫాం కోసం, ఇంటి అవసరాల నిమిత్తం, అలాగే ట్రాక్టర్ కొనుగోలుకు సుమారు రూ.15 లక్షల వరకు అప్పులు చేశాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలని మనస్తాపంతో ఈ నెల 21న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడికి భార్య దీప, మూడునెలల కూతురు ఉన్నారు. మృతుడి మేనమామ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో..

రామచంద్రాపురం టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రామకృష్ణ వివరాల ప్రకారం.. పటాన్‌చెరు డివిజన్ పరిధి బండ్లగూడ గ్రామానికి చెందిన వడ్డె రాజు(41) ప్రైవేటు సంస్థలో పని చేస్తున్నాడు. కొన్నిరోజులుగా కుటుంబసభ్యులతో కలహాలు రావడంతో ముభావంగా ఉంటున్నాడు. ఆదివారం రాత్రి శ్మశానంలోని వేపచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తమ్ముడు మహేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

చేపల వేటకు వెళ్లి యువకుడు..

శివ్వంపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లిన వ్యక్తి వల చుట్టుకుని మృతిచెందాడు. శివ్వంపేట మండలం దొంతి గ్రామానికి చెందిన కట్లే నర్సింలు(49) ఆదివారం ఉదయం స్థానిక కుందలమ్మ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చెరువులో వల విసురుతున్న క్రమంలో చేతికి వల చుట్టుకొని చెరువులో ఈదలేక నీట మునిగి మృతిచెందాడు. రాత్రి అవుతున్నా నర్సింలు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా సోమవారం చెరువులో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి భార్యకు మాటలు రాకపోవడంతో సోదరుడు పోచయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

అరగంట ముందే పాఠశాలకు తాళం



పాండ్యాతండాలో తాళం వేసి ఉన్న పాఠశాల

శివ్వంపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఒంటిపూట బడులు కూడా తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల ఉపాధ్యాయులు సమయ పాలన పాటించడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇలా వచ్చాం.. అలా వెళ్లాం అన్నట్లుగా కొందరు వ్యవహరిస్తున్నారు. మండల పరిధిలోని రెండు పాఠశాలలకు సోమవారం అరగంట ముందే తాళాలు వేసి ఉపాధ్యాయులు వెళ్లిపోయారు. వాస్తవంగా మధ్యాహ్నం 12.30 వరకు ఒంటిపూట బడులు నడపాల్సి ఉండగా, మండల పరిధిలోని రూప్లా తండా, పాండ్యా తండా ఉపాధ్యాయులు 12 గంటలకే తాళం వేశారు. ఈ పాఠశాలల్లో 11.30 గంటలకే మధ్యాహ్న బోజనాన్ని పెట్టి పాఠశాలకు తాళం వేసి వెళ్లారు. 12.10కి పాండ్యాతండా ఉపాధ్యాయుడు తాళం వేసి వెళ్లగా, చౌరస్తాలో కనిపిస్తే ప్రశ్నించగా, వేతనాల కోసం ఎంఆర్సీకి వెళ్తున్నానని చెప్పడం గమనార్హం. ఈ విషయమై జిల్లా విద్యాధికారిని సంప్రదించగా, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాలికను లోబర్చుకున్న యువకుడు

శివ్వంపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఓ బాలికకు మాయమాటలు చెప్పిన ఓ వ్యక్తి ఆమెను లోబర్చుకున్నాడు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఇంటర్ చదువుతోంది. అప్పటికే పెళ్లి అయి పిల్లలు ఉన్న ఓ వ్యక్తి ఆమెతో పరిచయం పెంచుకుని మాయమాటలు చెప్పాడు. ఇటీవల ఆమెను బయటకు తీసుకెళ్లాడు. ఈ విషయం అతని భార్యకు తెలియడంతో విషయం వెలుగుచూసింది. దీంతో బాధిత బాలిక కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం.



తూప్రాన్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆశావర్కర్లు

టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ

- హైదరాబాద్ వెళ్తున్న ఆశాల ముందస్తు అరెస్టు
- తూప్రాన్, మనోహరాబాద్, వెల్దుర్తి పోలీస్‌స్టేషన్లకు తరలింపు

తూప్రాన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లు చేపట్టిన 'చలో హైదరాబాద్ నేపథ్యంలో సోమవారం తూప్రాన్ పట్టణం అల్లాపూర్ శివారులోని టోల్ ప్లాజా వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్ తరలి వెళ్తున్న ఆశా వర్కర్లను అరెస్టు చేశారు. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, మెదక్ జిల్లాల నుం చి హైదరాబాద్ వెళ్తున్న ఆశా వర్కర్లను అడ్డుకోవడానికి తూప్రాన్ టోల్‌ప్లాజా మనోహరాబాద్, తూప్రాన్, శివ్వంపేట, వెల్దుర్తి పోలీసుల ఆధ్వర్యంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ వైపు వెళ్లే ప్రతీ వాహనం తనిఖీ చేశారు. పలువురు ఆశా వర్కర్లను ముందస్తు అరెస్టు చేసి తూప్రాన్, మనోహరాబాద్, వెల్దుర్తి పోలీసుస్టేషన్లకు తరలించారు. అరెస్టు చేసిన 40 మంది ఆశా వర్కర్లను తూప్రాన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వరకు స్టేషన్‌లో ఉంచి సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

పరిశ్రమల రక్షణపై ఎస్పీ ఆరా



వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ

ఐడీఏబొల్లారం మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కొత్త పోలీస్ బాస్ ఎస్పీ పరితోష్ పంకజ్ సోమవారం ఐడీఏబొల్లారం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఎక్కువగా ఉండటంతో పరిశ్రమలకు సంబంధించిన భద్రతా వ్యవహారాలపై వివరాలు సీఐ రవీందర్‌రెడ్డిని అడిగితెలుసుకున్నారు. ఐడీఏబొల్లారం, ఖాజిపల్లి, గడ్డపోతారం పారిశ్రామికవాడల వైశాల్యం పరిశ్రమల సంఖ్య, పని చేస్తున్న కార్మికుల సంఖ్యతోపాటు నివాసాల ప్రాంతాలు, నేరాలపై ప్రభావం, ఇతర రాష్ట్రాల కార్మికుల కదలికలు నేర ప్రవృత్తి వంటి అంశాలపై చర్చించారు. అనంతరం ఏడాదిలో జరిగిన నేరాల వివరాలు నమోదు ప్రక్రియలను పరిశీలించారు. పారిశ్రామికవేత్తలకు ఎప్పటికప్పుడు భద్రతాపరమైన రక్షణ చర్యలు చేపడుతున్న విధానాలను అడిగారు.

టీబీ రహిత సమాజం కోసం కృషి చేయాలి



వరల్డ్ టీబీ డే ర్యాలీలో డీఆర్‌వో పద్మజారాణి, వైద్య అధికారులు, సిబ్బంది

సంగారెడ్డి అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): టీబీ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఆర్‌వో పద్మజారాణి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ పేర్కొన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జెడ్పీ కార్యాలయం వద్ద డీఆర్‌వో పద్మజారాణి ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ డీఎంహెచ్‌వో ఆఫీస్ వరకు కొనసాగింది. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ క్షయ నివారణకు అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు అందిస్తారని, రోగులు వినియోగించుకోవాలని సూచించారు. క్షయ వ్యాధి ఆదిలోనే గుర్తించి చికిత్స పొందాలని కోరారు. అనంతరం నిక్షయ్ మిత్రులకు న్యూట్రిషన్ కిట్స్ అందించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్షయ నివారణ సిబ్బంది, టీబీ అలర్ట్ ఎన్‌జీవో, భవ్య ఎన్‌జీవో, టీబీ చాంపియన్‌లకు, నిక్షయ్ మిత్రలను సన్మానించి మెమోంటోలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.సంధ్యరాణి, డీటీసీవో డా.అరుణకుమారి, డీసీహెచ్‌ఎస్ డా.సంగారెడ్డి, డెమో ప్రసాద్, డిప్యూటీ డెమో మంగ, డీఎల్‌వో డా.మహేందర్‌రెడ్డి, డా.చక్రపాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలన అందరి బాధ్యత



మాట్లాడుతున్న డాక్టర్ పల్వన్‌కుమార్

సిద్దిపేట టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): క్షయ నిర్మూలన అందరి బాధ్యత అని సిద్దిపేట డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పల్వన్‌కుమార్ సూచించారు. సోమవారం డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా అధికారులు, సిబ్బందితో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిని త్వరతగతిన గుర్తించి, వ్యాధి తీవ్రత పెరగకుండా చూడాలన్నారు. అందరి సమష్టి కృషితో క్షయరహిత జిల్లాగా మారుద్దామన్నారు. క్షయ నియంత్రణ ఇన్‌చార్జి డాక్టర్ అరుణ్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆనంద్, ప్రోగ్రాం అధికారి ఎన్‌సీడీ డాక్టర్ నారాయణరావు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీకళ, సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

యూత్ పార్లమెంట్ సువర్ణ అవకాశం



మాట్లాడుతున్న డాక్టర్ పల్వన్‌కుమార్

మెదక్ అర్బన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): యువత తమ అభిప్రాయాలు చెప్పే సువర్ణ అవకాశాన్ని వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కల్పించిందని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ పేర్కొన్నారు. యువ ఉత్సవ్ 2025లో భాగంగా సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు జరుగనున్న జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ ఉత్సవాలను అదనపు ఎస్పీ మహేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తు నేటి యువతపైనే ఉందన్నారు. పార్లమెంట్‌లో సైతం తమ అభిప్రాయాలను తెలిపే సువర్ణ అవకాశమని, యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వన్ నేషన్- వన్ ఎలక్షన్ అనే అంశంపై మెదక్- సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాలకు సంబంధించి యువత రెండు రోజులపాటు 75 మంది చొప్పున మూడు నిమిషాలు ప్రసంగించనున్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 10 మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నట్లు కమిటీ తెలిపింది. రాష్ట్రస్థాయిలో ఎంపికైన విజేతలు పార్లమెంట్ మాట్లాడే అవకాశం పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా.హుస్సేన్, డీఆర్డీఏ పీడీ శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



బెజ్జంకి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి ఓ ఆర్టీసీ బస్సు పంట పొలాల్లోకి దూసుకెళ్లిన సంఘటన బెజ్జంకి మండలం ముత్తన్నపేట శివారులో సోమవారం చోటుచేసుకుంది. కరీంనగర్-1 డిపోకు చెందిన ఆర్టీసీ (పల్లెవెలుగు) బస్సు కరీంనగర్ నుంచి బెజ్జంకి మండల కేంద్రానికి 41 మంది ప్రయాణికులతో బయలు దేరింది. ఈ క్రమంలో ముత్తన్నపేట స్టేజీ సమీపంలోని కల్వర్టు వద్దకు రాగానే ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ప్రయాణికులెవరికీ ఏమీ కాలేదు. బస్సులో ఉన్న వారంతా ప్రైవేట్ వాహనాల్లో తమతమ గమ్యస్థానాలకు వెళ్లిపోయారు.

తెల్ల'బంగారమే'..!

- అధిక సాంద్రతతో అనేక లాభాలు
- తక్కువ సమయం.. ఎక్కువ దిగుబడి
- చీడపీడలు రాకముందే పంట చేతికి..
- ఎకరాకు 15 క్వింటాళ్ల పత్తి
- పెరుగుతున్న సాగు విస్తీర్ణం



గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌లో అధిక సాంద్రత విధానంలో సాగు చేసిన పత్తిపంట

గజ్వేల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగులో నూతన పద్ధతులు పాటిస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. పత్తి సాగు చేస్తే అప్పులే అన్న మాటను అబద్ధం చేస్తూ.. అధికసాంద్రత విధానంలో సాగు చేసి.. పత్తిసాగు భలే బాగు అంటున్నారు. తక్కువ పెట్టుబడి.. ఎక్కువ లాభాలు వస్తుండటంతో రైతులు అధిక సాంద్రత పత్తి సాగు వైపు మొగ్గుచూపుతున్నారు. ఇందుకు వ్యవసాయ అధికారుల సలహాలు.. సూచనలు కూడా తోడు కావడంతో జిల్లాలో అధిక సాంద్రత పత్తి సాగు ఏటా పెరుగుతోంది.

మూడేళ్ల క్రితం పైలట్ ప్రాజెక్టుగా సిద్దిపేట జిల్లాలో పంట సాగును చేపట్టగా, మొదటి ఏడాది 1040 ఎకరాల్లో అధిక సాంద్రత పత్తిపంటను రైతులు సాగు చేశారు. రెండో ఏడాది 2వేల ఎకరాల్లో సాగు చేయగా, ఈ ఏడాది దాదాపుగా 3వేల ఎకరాల్లో అధిక సాంద్రత పత్తిని సాగు చేశారు. ఈ పంట ద్వారా రైతులు లాభాలే తప్ప నష్టం లేదని స్వయంగా సాగు చేసిన రైతులే చెబుతున్నారు. ఈ యేడు గజ్వేల్ మండల పరిధిలోని అక్కారం, దాతర్‌పల్లి, అహ్మదీపూర్ గ్రామాల్లో అధిక సాంద్రత పద్ధతిలో పత్తిని సాగు చేయగా, మర్కుక్ మండల కేంద్రంతోపాటు నర్సన్నపేట, ఎర్రవల్లి, పాములపర్తి గ్రామాల్లో, రాయపోల్ మండలంలోని పలు గ్రామాల్లో అధిక సాంద్రత పత్తిని సాగు చేశారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ ప్రత్యేక శ్రద్ధతో పాటు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, అధికారులు అధిక సాంద్రత విధానంలో పత్తిని సాగు చేయాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇటీవలే రాయపోల్ మండలంలో రైతులకు ఈ విధానంలో సాగుపై ప్రత్యేక శిక్షణను ఇచ్చారు.

విత్తే, సాగు చేసే విధానం వేరు..

పత్తి పంటను సాధారణంగా శాస్త్రీయపద్ధతిలోనే దశాబ్దాలుగా రైతులు సాగుచేస్తున్నారు. రానురాను పత్తి విత్తే పద్ధతితో పాటు సాగు చేసే విధానంలోనే తేడా సుస్పష్టంగా కనిపిస్తుంది. దేశంలో సాగు చేస్తున్న సాంప్రదాయ విధానంలో ఎకరాకు కేవలం 8వేల మొక్కలను నాటుతుండడంతో దిగుబడి ఐదు నుంచి ఏడు క్వింటాళ్లు వస్తుంది. దీంతో రైతు శారీరక, మానసిక కష్టంతో పాటు, పెట్టుబడి రాని పరిస్థితి నెలకొంటుంది. సాధారణంగా జిల్లాలో 90/60 రేషియోలో పత్తిని సాగు చేస్తుండగా, అధిక సాంద్రత పత్తిలో 90/30 పద్ధతిలో సాగుచేస్తున్నారు. దీంతో ఎకరంలో 29వేల మొక్కలను నాటుతున్నారు. దాదాపుగా వెయ్యి నుంచి రెండు వేల మొక్కలు పోగా, దాదాపుగా 25 వేల మొక్కలు బతుకుతున్నాయి. ఈ 25వేల మొక్కలకు ఒక్కో మొక్కకు 20 నుంచి 25కాయలు వస్తున్నాయి. ఒక్కో కాయలో వచ్చే పత్తి బరువు 4గ్రాములుగా ఉంటుంది. దీంతో దాదాపుగా ఎకరాకు సరాసరి 15నుంచి 16క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు.

ఐదు రకాల ప్రయోజనాలు

అధిక సాంద్రత పత్తి సాగుతో ఐదు రకాల ప్రయోజనాలు రైతులకు చేకూరనున్నాయి. మొదటగా రైతులు సాగుచేసే పంటకు ప్రతి ఎకరాకు ప్రభుత్వం రూ.4వేలు అందించనుంది. పత్తి పంట కాలం కేవలం 145 రోజులలో ముగుస్తుండడంతో యాసంగిలో మరోపంట వేసుకునే వీలుంది. అంతేకాకుండా 145 రోజులలో పంట కాలం ముగుస్తుండడంతో పింక్ బోల్ వార్మింగ్(గులాబీ రంగు పురుగు) వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. సాధారణంగా గులాబీ రంగు పురుగు వంద రోజులు దాటిన అనంతరం పంటలను ఆశిస్తుంది. కానీ. అప్పటికే గూడ, కాత రావడంతో పత్తికి పెద్దగా నష్ట కలిగే అవకాశాలు ఉండవు. ప్రతి ఏటా సెప్టెంబరులో భారీ వర్షాలు కురుస్తుండడంతో వర్షానికి గూడ రాలిపోయే అవకాశాలున్నాయి. సెప్టెంబరులో అధిక సాంద్రత పత్తిలోని గూడ కాయగా మారడంతో గూడ రాలే ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

దిగుబడి బాగుంది..

అధిక సాంద్రత పత్తితో దిగుబడి బాగుంది. వాస్తవానికి సాధారణ పత్తి సాగులో ఎకరాకు ఆరు నుంచి ఎనిమిది క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. అధిక సాంద్రత పత్తి సాగు విధానంలో ఎకరాకు పదిహేను క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చింది. నేను రెండు ఎకరాల్లో పత్తిని సాగుచేశారు. దాదాపుగా 34 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చింది. జూన్ చివరి వారంలో పత్తిని నాటాను. నవంబరు నాటికి పంట చేతికి వచ్చింది. డిసెంబర్‌లో సన్‌ఫ్లవర్‌ను సాగు చేశా. ఆ పంట కూడా చేతికి వస్తుంది. రైతులు ఈ విధానంలో పత్తిని సాగు చేసి మంచి దిగుబడులు పొందవచ్చు. చీడపీడలు ఆశించే సమయానికి పంట కాలం పూర్తవుతుంది. నావరకు అయితే వచ్చే ఏడాది ఇదే విధానంలో పత్తిని సాగు చేస్తా.

-సింగిరెడ్డి ముత్యంరెడ్డి, రైతు, అహ్మదీపూర్

అధికసాంద్రత పత్తితో అధిక రాబడులు



అధిక సాంద్రత పత్తి సాగుతో రైతుకు అధిక రాబడి వస్తుంది. ఈ పత్తి సాగుతో మరోపంటకు అవకాశం లభిస్తుంది. పత్తికి గులాబీ రంగు పురుగు ఆశించే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. ఈ పత్తి సాగు విజయవంతం అయింది. ఈ ఏడాది 25వేల మొక్కల సాగు పూర్తి చేశారు. వానాకాలంలో పంట నవంబరులోనే పూర్తికావడంతో డిసెంబరులో యాసంగి పంటను రైతులు సాగు చేశారు. గజ్వేల్ డివిజన్ పరిధిలోని ఆయా గ్రామాల్లో అధిక సాంద్రతలో పత్తిని సాగు చేయడానికి రైతులు ముందుకు వస్తున్నారు.

- బాబునాయక్, గజ్వేల్ ఏడీ

వెళ్లొస్తాం..మల్లన్నా



తల్లిని భుజాలపైకి ఎత్తుకుని అగ్నిగుండం దాటుతున్న భక్తుడు

5వ పేజీ తరువాయి..

మునలఖడ్గపూజ, సుంకు, అగ్నిప్రతిష్ఠ, సుప్రభాత పూజ, ఇంద్రాది అష్టదిక్పాలకులకు బలిహరణ, అగ్నిగుండార్చన, శాంతిపూజ, అగ్ని గుండ ప్రవేశ పూజలు జరిపారు. ఆయా దేవతలను స్తుతిస్తూ దండకాలు వేశారు. అష్టదిక్కులా గుమ్మడికాయలతో బలిహరణ జరిపారు. జగద్గురు సిద్దేశ్వరానందగిరి మహాస్వామి రాక పాద పూజ జరిపారు. అర్చకులు వీరభద్రుడి విజయ ఖడ్గం తీసుకొచ్చి ఆవాహనం అనంతరం మల్లన్నను కీర్తిస్తూ గుండాలు దాటడాన్ని ప్రారంభించారు. శివసత్తులు, భక్తులు, ఆచారవతులు పూనకంతో కణకణరగిలే నిప్పుల అగ్నిగుండాలను దాటి మొక్కులు తీర్చుకున్నారు. గుండాలు దాటాం..మా గండాపు బాపు అంటూ స్వామివారిని దర్శించుకున్నారు. తమను చల్లగా కాపాడాలని వేడుకున్నారు. మల్లన్న చరిత్రను, అగ్నిగుండాల విశిష్టతను తెలంగాణ రాష్ట్ర ఆగమ వాస్తు సలహా కమిటీ సభ్యులు డాక్టర్ మహంతయ్యస్వామి కనులకు కట్టినట్లుగా భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఈవో రామాంజనేయులు, ధర్మకర్తలు జయప్రకాశ్‌రెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్, అంజిరెడ్డి, మోహన్‌రెడ్డి, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్‌లు సురేందర్‌రెడ్డి, శ్రీరాములు పాల్గొన్నారు. చేర్యాల సీఐ శ్రీను ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తు చర్యలు చేపట్టారు.

ఘనంగా ఏకాదశ రుద్రాభిషేకం

అగ్నిగుండాల కార్యక్రమ నిర్వహణ అనంతరం సోమవారం మల్లన్న ఆలయంలో వీరశైవార్చకులు విజయోత్సవం, ఏకాదశ రుద్రాభిషేకం, జంగమార్చన తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

బుకింగ్ ఆదాయం రూ.70లక్షలు

చివరివారం సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ క్రమంలో శనివారం రూ.6.66లక్షలు, ఆదివారం రూ.54,96లక్షలు, సోమవారం సుమారు రూ.8లక్షలుమేర బుకింగ్ ఆదాయం సమకూరిందని ఆలయ వర్గాలు తెలిపాయి.

కొమురవెల్లికి మళ్లొస్తాం..

గత డిసెంబరు 29న జరిగిన కల్యాణంతో ప్రారంభమైన మల్లన్న బ్రహ్మోత్సవాలు సోమవారం తెల్లవారుజామున నిర్వహించిన అగ్నిగుండాలతో ముగిశాయి. మూడునెలలపాటు 10వారాలు ప్రతీ ఆదివారం సాగిన జాపపదుల మహాజాతరకు తెరపడింది. చివరి ఘట్టమైన అగ్నిగుండాలకు తరలివచ్చిన భక్తులు సోమవారం మూటముల్లె సర్దుకుని వెనుదిరిగారు. "కోరిన కోర్కెలు తీర్చుతూ కొంగుబంగారంగా పూజలందుకుంటున్న మల్లన్న స్వామి వెళ్లొస్తాం.. వచ్చే యేడు మళ్లొస్తామని" అంటూ ఇంటిముఖం పట్టారు. దీంతో ఎటుచూసినా కిటకిటలాడిన ఆలయ పరిసరాలన్నీ బోసిపోయాయి.



జాతర ముగియడంతో తిరుగు ప్రయాణంలో భక్తులు



ఉత్సాహంగా అగ్నిగుండాలు దాటుతున్న పోలీసు సిబ్బంది

చేతులు కలిపారు..

సీఎంను కలిసిన మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ అధికార ప్రతినిధి



గజ్వేల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావులు చేతులు కలిపారు. కొన్ని రోజులుగా ఉప్పు, నిప్పులా ఉన్న వీరిద్దరిని కలపాలని, గజ్వేల్‌లో వర్గాలు లేకుండా చూడాలని కాంగ్రెస్ అధిష్ఠానం ముఖ్యంగా టీపీసీసీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సంకల్పం నెరవేరింది. నేరుగా సీఎం సమక్షంలోనే ఇరువురు చేతులు కలిపి, గజ్వేల్ లో వర్గాలకు చెక్ పెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐసీసీ, టీపీసీసీ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పార్టీని బలోపేతం చేస్తూ, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తామని పేర్కొన్నట్లు తెలిసింది. వీరి ఫొటో గజ్వేల్ నియోజకవర్గ సోషల్ మీడియాలో వైరల్ అయింది.

కోవర్టు రాజకీయాలకు పెట్టింది పేరు బీఆర్‌ఎస్

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

నర్సాపూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కోవర్టు రాజకీయాలకు బీఆర్‌ఎస్ పేరుగాంచిందని, ఆ పార్టీ నాయకులు ప్రభుత్వంపై చేసే విమర్శలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు పేర్కొన్నారు. సోమవారం డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ అధ్యక్షతన నర్సాపూర్‌లో నిర్వహించిన జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పదేళ్లపాటు అధికారంలో ఉండి కూడా ప్రజలకు చేసింది ఏమీ లేదని, కేవలం కేసీఆర్ కుటుంబం ఆస్తులు పెంచుకుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పదిహేను నెలలోనే ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నా వాటిని పూర్తిస్థాయిలో ప్రచారం చేయలేకపోతున్నామన్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నందున ప్రతి గ్రామంలో పార్టీ కార్యకర్తలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను విస్తృత ప్రచారం చేస్తు ఎన్నికలలో అత్యధిక స్థానాలు గెలిచి సత్తా చాటాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా మత రాజకీయాలు తప్పా ప్రజలకు చేసేదేమీ లేదన్నారు. భారత రాజ్యాంగాన్ని దెబ్బతియాలనే కుట్ర పన్నుతున్నారని దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవడానికి బీజేపీ ప్రయత్నిస్తుందని రాష్ట్రంలో ఆ పార్టీ ఇప్పట్లో అధికారంలో వచ్చే అవకాశమే లేదన్నారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ సుకుమార్, పీసీసీ ఉపాధ్యక్షులు శ్రావణ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆవులరాజిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు రాజుయాదవ్, వెంకట్రామ్‌రెడ్డి, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

అయితే..మాకేంటీ?



పైసలొచ్చే పనులకే మొగ్గు.. కనీస సౌకర్యాలు వద్దు

- జిల్లాలో రూ.74 కోట్లతో ఈజీఎస్ పనులు
- రూ.72 కోట్లు సీసీ రోడ్లకే..
- 'మురికి'కూపాలుగా గ్రామాలు



హసన్‌మీరాపూర్‌లో మురికికాలువ పరిస్థితి

దుబ్బాక, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): 'ఏదైనా పని చేస్తే మనకు మిగిలేది ఎంత? మన అనుచరులకు గిట్టుబాటు అవుతుందా?' ఇదే ఇప్పటి నేతల ఆలోచన. 'నేతలు చెప్పారు మనదేం పోయింది వారు చెప్పినట్లు చేద్దాం.' ఇది అధికారుల తీరు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలనే ఆలోచనను మర్చిపోయారు. నిబంధనలు పక్కన పెడుతున్నారు. జిల్లాలో ఆఘమేఘాల మీద మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సుమారు రూ. 74 కోట్ల 94 లక్షల విలువైన సుమారు 768 పనులు చేపడుతున్నారు. వాస్తవానికి ఈజీఎస్ ప్రతిపాదనల్లో గ్రామాల్లో మురికికాలువలు, సీసీ రోడ్లు వేయాలనే నిబంధన ఉంది. కానీ, రూ. 72 కోట్లు కేవలం సీసీ రోడ్ల పనులకే కేటాయించారు. ఎంపీ, ఎమ్మెల్యేల ప్రతిపాదనలతో ఈ పనులకు నిధులు కేటాయించినట్లు సమాచారం. మిగిలిన రూ. 2 కోట్లతో అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ భవనాలు నిర్మిస్తున్నారు. ఇందులో ఒక్క రూపాయి కూడా గ్రామాల్లో మురికి కాలువలకు కేటాయించలేదు. సీసీ రోడ్ల పనులు అయితే తూతూ మంత్రంగా పూర్తి చేసి, నిధులు మిగిల్చుకుని వాటాలు పంచుకోవచ్చుననే ఆలోచనతో ఈ పనులకు అధిక శాతం నిధులు కేటాయించినట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

మురికికాలువలు లేని గ్రామాలెన్నో..

జిల్లాలో 499 గ్రామాలు ఉండగా, మురికికాలువలు లేని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. అసలే గ్రామ పంచాయతీల్లో నిధులు లేక పారిశుధ్య పనులు కూడా చేసే పరిస్థితులు లేవు. ఈ క్రమంలో మురికి కాలువల నిర్మాణాన్ని చేపట్టడం జీపీలకు తలకు మించిన భారంగా మారింది. ఈజీఎస్ నిధులతో గ్రామాల్లో మురికికాలువలు నిర్మిస్తే సమస్య కొంతలో కొంతైన పరిష్కారం అయ్యేది. మురికి కాలువలు లేక మురుగు నీరంతా తాగునీటి పైప్‌లైన్లు, గేట్‌వాల్‌లలో చేరి జనం రోగాల బారిన పడుతున్నారు.

జీపీలకు భవనాలు లేవు..

జిల్లాలో సుమారు 267కుపైగా గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు ఉన్నాయి. మిగిలిన జీపీ కార్యాలయాలన్ని అద్దె భవనాల్లో సాగుతున్నాయి. దీంతో కొన్ని జీపీల్లో రికార్డుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాలో 1150 అంగన్‌వాడీలు ఉండగా, 468 అంగన్‌వాడీలకే సొంత భవనాలు ఉన్నాయి. ఈజీఎస్ కింద 26 గ్రామాల్లోని అంగన్‌వాడీలకు భవనాలు నిర్మించేందుకు రూ. 8లక్షల చొప్పున నిధులు మంజూరు చేసినప్పటికీ, కేవలం 5 భవనాల పనులే ప్రారంభించారు. ఈజీఎస్ కింద చేపట్టిన పనులన్నీ ఈనెల 25 వరకు పూర్తికావల్సి ఉండగా, నారాయణరావుపేట మండలంలో ఒక్కటి, హుస్నాబాద్ మండలం బెజ్జంకి, నర్సింలపల్లె, జగదేవ్‌పూర్ మండలం గొల్లపల్లి, కుకునూర్‌పల్లి మండలం బొప్పాయిపల్లి గ్రామాల్లో పునాదుల వరకే పనులు అయ్యాయి.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

గజ్వేల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి నాలుగు రోజుల జైలు శిక్షను విధిస్తూ గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక తీర్పును ఇచ్చారని ట్రాఫిక్ సీఐ మురళీ తెలిపారు. గజ్వేల్, సిద్దిపేట పట్టణాల్లో నిర్వహించిన వాహన తనిఖీల్లో 21 మంది మద్యం తాగి నడుపుతూ పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపరచగా గజ్వేల్ కోర్టు పరిధిలో 11 మందికి రూ.66 వేల జరిమానా విధించారు. సిద్దిపేట కోర్టు పరిధిలో 10 మందికి రూ.14,500 జరిమానా విధించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తొగుట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావ్‌పేట గ్రామంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సహకారంతో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ కంకణాల నర్సింహులు, పంచాయితీ కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

27న దౌల్తాబాద్ తైబజారు, పశువుల సంత వేలం

దౌల్తాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27న దౌల్తాబాద్ గ్రామపంచాయతీ తైబజార్, పశువుల సంతకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం పంచాయతీ కార్యాలయంలో మండల పంచాయతీ అధికారి సయ్యద్ గఫూర్ ఆధ్వర్యంలో వేలం జరుగుతుందన్నారు.

నిరుపేద వధువుకు పుస్తె, మట్టెలు పంపిణీ

తొగుట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన నిరుపేద వధువు అంబిగళ్ల రుచిత వివాహానికి మాజీ ఎంపీటీసీ వేల్పుల స్వామి ముదిరాజ్ సోమవారం పుస్తెమట్టెలను అందజేశారు. కార్యక్రమంలో వధువు తల్లితండ్రులు శ్యామల - గజేందర్, నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్సీ అద్దంకిని కలిసిన మాలమహానాడు నాయకులు

చేర్యాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణానికి చెందిన జాతీయ మాలమహానాడు నాయకులు సోమవారం ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌ను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు బుట్టి సత్యనారాయణ, చంద శ్రీకాంత్ తదితరులు ఆయనను సన్మానించారు. చేర్యాల ప్రాంత అభివృద్ధికి చొరవ వహించాలని కోరారు.

ఆశాలను అరెస్టు చేయడం సరికాదు

దుబ్బాక/మిరుదొడ్డి, మార్చి24 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించకుండా పోలీసులతో అక్రమ అరెస్టులను చేయడం సిగ్గుచేటని సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్ మండిపడ్డారు. సోమవారం తమ సమస్యల పరిష్కారానికి తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలివెళ్తున్న ఆశాలను పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చేర్యాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : వేసవికాలంలో దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బాటసారులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని చేర్యాల చేర్యాల మున్సిపల్ కమిషనర్ నాగేందర్ అన్నారు. మాజీమంత్రి నిమ్మ రాజిరెడ్డి మనువడు నిఖిల్‌రెడ్డి అంగడిబజారులో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు.

స్నేహితులకు ఇఫ్తార్

మర్కుక్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం సందర్భంగా మర్కుక్ మండలం ఎర్రవల్లి రెడ్డి సంఘం అధ్యక్షులు నరేష్‌రెడ్డి గృహంలో స్వగ్రామంతో పాటు ఇటిక్యాలకు చెందిన ముస్లిం స్నేహితులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా మిత్రులు మాజీ సర్పంచ్ భాగ్యాబిక్షపతి, ఇబ్రహీం అజీజ్ పాషా, అన్వర్ పాషా, ఇస్మాయిల్ అలీతో కలిసి చిన్ననాటి నుంచి కులమతాలకతీతంగా గ్రామాభివృద్ధిలో పాలు పంచుకుంటున్న సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు.

సిబ్బంది కొరతను తీర్చాలి

హుస్నాబాద్, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో నెలకొన్న సిబ్బంది కొరతను తీర్చాలని భారతీయ కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌చార్జి కవ్వ వేణుగోపాల్‌రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. సోమవారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్‌లో 120 మంది కార్మికులను నియమిస్తే 80 మంది మాత్రమే పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్నారని, మిగతా కార్మికులు కార్యాలయంలో పని చేస్తున్నారని తెలిపారు. దీంతో పారిశుధ్య పనులు సరిగా జరగడం లేదన్నారు. పూర్తి స్థాయిలో ఏఈతో పాటు టీపీఎస్‌ను నియమించాలని కోరారు.

బ్రిడ్జి నిర్మాణం ఇంకెన్నాళ్లకు?

రెండేళ్లయినా శిలాఫలకానికే పరిమితం

నిధులు మంజూరైనా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం

పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు





రాఘవాపూర్ వద్ద శిథిలావస్థలో ఉన్న ఇరుకు బ్రిడ్జి, 2023లో ఏర్పాటు చేసిన శిలాఫలకం

సిద్దిపేట రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని ఉద్దేశంతో రోడ్డు విస్తరణలో భాగంగా సిద్దిపేట-ముస్తాబాద్ రహదారిలో సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ వద్ద బ్రిడ్జి నిర్మించేందుకు ప్రతిపాదించారు. రూ.3.30 కోట్ల నిధులు కూడా మంజూరయ్యాయి. పనులకు శంకుస్థాపన చేసి రెండేళ్లు కావస్తున్నా అతీగతీ లేదు. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ నేటికి కన్నెత్తి చూడడంలేదు. ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో బ్రిడ్జి నిర్మాణ పనులకు మోక్షం లభించడం లేదు.

వందలాది వాహనాలతో రద్దీగా..

సిద్దిపేట-ముస్తాబాద్, కామారెడ్డికి రాఘవాపూర్ మీదుగా నిత్యం వందలాది వాహనాలు వెళతుంటాయి. ఈ దారిలో రెండు వరుసల రోడ్డు విస్తరణ పనులు పూరై ఏళ్లు గడుస్తున్నా బ్రిడ్జి నిర్మాణం పనుల్లో మాత్రం అలసత్వం వహిస్తున్నారు. ఇప్పటికే బ్రిడ్జి ఇరుకుగా మారి, శిథిలావస్థలోకి చేరింది. ఓవైపు గోయి ఏర్పడడంతో వాహనదారులు బ్రిడ్జి వద్దకు రాగనే జంకుతున్నారు. ఇరుకు బ్రిడ్జిపై రెండు వాహనాలు ఒకేసారి వెళుతున్నప్పుడు, పట్టుతప్పి బ్రిడ్జి సైడ్ వాల్ మీదకు దూసుకెళ్లి ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. వర్షాలు కురిసినప్పుడు ఎగువ ప్రాంతం నుంచి వరద ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు బ్రిడ్జి ఎప్పుడు కూలిపోతుందేమోనని ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

పాత బకాయిలు చెల్లిస్తేనే పనులు

బ్రిడ్జి నిర్మాణం పనులకు టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు గతంలో చేసిన పనులకు బిల్లులు ఇవ్వడంలేదు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలో పని చేసిన పనులకే కోట్లల్లో బకాయిలు ప్రభుత్వం నుంచి రావాలని, అవి వచ్చే వరకు పనులు చేసేది లేదని కాంట్రాక్టర్ మొండికేస్తున్నారని తెలిసింది.

వెంటనే పనులు ప్రారంభించాలి



నిత్యం వందలాది వాహనాలు బ్రిడ్జిపై నుంచి వెళ్తుంటాయి. రెండు వరుసల రహదారి పనులు పూర్తైనప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో బ్రిడ్జి పనులు ప్రారంభం కావడం లేదు. కాలయాపన చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి. బ్రిడ్జి నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలి. లేనిపక్షంలో ఆందోళన చేపాడుతాం.

- తాడేపు కమ్మ శ్రీనివాస్, బీజేవైఎం సిద్దిపేట అసెంబ్లీ కన్వీనర్

బెట్టింగ్‌లకు పాల్పడితే కేసులు నమోదు చేస్తాం

● సీపీ డాక్టర్ బి.అనురాధ

సిద్దిపేట క్రైం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. చాలామంది యువత ఈజీగా డబ్బు సంపాదించడం కోసం ప్రస్తుతం కొనసాగుతున్న ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లలో బెట్టింగ్‌కు పాల్పడుతున్నారని తెలిపారు. నష్టపోయి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌పై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి నిఘా ఏర్పాటు చేశామని సీపీ పేర్కొన్నారు. ఇంట్లో తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గమనించాలని సూచించారు. క్రికెట్ మ్యాచ్ ప్రారంభమైన తర్వాత పిల్లల్లో ఏదైనా మార్పు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడితే డయల్ 100 లేదా సిద్దిపేట పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712667100 సమాచారం అందించాలని సీపీ సూచించారు. గంజాయి ఇతర మత్తు పదార్థాల రహిత జిల్లాకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీపీ అనురాధ కోరారు. తెలంగాణ నార్కోటిక్ డ్రగ్ యాంటీ నార్కోటిక్ సోల్జర్‌గా ఎంపికై శిక్షణ పూర్తి చేసుకొని వచ్చిన మంద జనార్దన్, వడ్ల శ్రీనివాస్ సోమవారం సీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని సీపీ అభినందించి స్కూల్, కాలేజీలు, ఇతర ప్రదేశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సీపీ వారికి సూచించారు.

ఓపీ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రేవతి



రికార్డులను తనిఖీ చేస్తున్న డాక్టర్ రేవతి

సిద్దిపేట రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే అవుట్‌పేషంట్(ఓపీ) వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రేవతి సిబ్బందికి సూచించారు. సోమవారం నారాయణరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ రేవతి మాట్లాడారు. ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన తెలంగాణ హెల్త్ ఇన్ఫర్మేషన్ మేనేజ్మెంట్ సిస్టమ్ వెబ్‌సైట్‌లో ప్రతీరోజు ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల వివరాలను నమోదు చేయాలన్నారు. ఆరోగ్య కేంద్రంలో ఇంటర్‌నెట్ సౌకర్యం లేకపోవడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాపురెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఏఐ విద్యతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపు

కుకునూరుపల్లి ఎంఈవో బచ్చలి సత్తయ్య



బోధనను పరిశీలిస్తున్న ఎంఈవో సత్తయ్య

కుకునూరుపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఏఐ బోధనతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని ఎంఈవో సత్తయ్య తెలిపారు. సోమవారం మండలంలోని తిప్పారం ప్రాథమిక పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెంట్(ఏఐ) బోధనను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏఐతో విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి పెరుగుతుందని, ఆధునిక సాంకేతికతో నైపుణ్యాన్ని పెంపొందించుకోవచ్చని సూచించారు. పాఠశాలలో ఎండ్ టెస్ట్‌ను పరిశీలించి విద్యార్థులతో చదివి వినిపించారు.

పెరుకలగడ్డ ప్రాథమిక పాఠశాలలో..

కోహెడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెరుకలగడ్డ పాఠశాలలో ఏఐ బోధనను సోమవారం ప్రారంభించారు. దీని ద్వారా ఎఫ్ఎల్ఎన్ విధానంలో విద్యార్థులకు సులభతరంగా బోధనను అందించడం జరుగుతుందని జిల్లా సెక్టోరియల్ అధికారులు పి.రామస్వామి, బేతి భాస్కర్, మండల విద్యాధికారి ఆర్.పద్మయ్య తెలిపారు.

విద్యార్థులకు నైతిక విలువలను నేర్పించాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏజీఎం చైతన్యరావు

సిద్దిపేట కల్చరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు విద్యతో పాటుగా సంస్కృతీ, సంప్రదాయాలు, నైతిక విలువలను నేర్పించాలని టీచర్లకు ఏజీఎం చైతన్యరావు సూచించారు. సిద్దిపేటలోని నారాయణ హైస్కూల్‌లో పాఠశాల ప్రిన్సిపాల్ రమ్య ఆధ్వర్యంలో ఫ్యామిలీ బ్లిస్ పేరిట తల్లిదండ్రుల పాద పూజ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. విద్యార్థులు తల్లిదండ్రుల పాదాలను అభిషేకించి ఆశీర్వాదం తీసుకున్నారు.

బెజ్జంకి లక్ష్మీనృసింహస్వామి హుండీ లెక్కింపు

బెజ్జంకి/హుస్నాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బెజ్జంకి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ హుండీని సోమవారం అధికారుల సమక్షంలో లెక్కించారు. ఆరు నెలల హుండీని లెక్కించగా రూ. 1.46 లక్షల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జెల్ల ప్రభాకర్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మీ, ఈవో విశ్వనాథశర్మ, ఆలయ డైరెక్టర్‌లు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. హుస్నాబాద్ రేణుకాఎల్లమ్మ ఆలయ హుండీ లెక్కింపు ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. 81 రోజులకు రూ. 92,218 ఆదాయం సమకూరిందని దేవాదాయ శాఖ అధికారి శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

గుర్జకుంటలో మానవహారం

చేర్యాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ టీబీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం చేర్యాల మండలం గుర్జకుంట గ్రామంలో వివేకానంద వెల్ఫేర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏఎన్ఎం, ఆశ సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు దొమ్మాట రాజు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాన్ని అందించాలి

మిరుదొడ్డి, మార్చి24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం వీవోఏలకు రూ.20వేల వేతనాన్ని కనీస వేతనాన్ని అందించాలని ఆ సంఘం రాష్ట్ర నాయకురాలు యమున, స్వప్న, శోభ డిమాండ్ చేశారు. సోమవారం మిరుదొడ్డిలో వీవోఏల సమస్యలను పరిష్కరించాలని ఏపీఎం దాకయ్యకు వారు వినతిపత్రాన్ని అందజేశారు. 25న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని వీవోఏలు విజయవంతం చేయాలని కోరారు.

కోటి తలంబ్రాల దీక్ష

వర్గల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : గజ్వేల్ శ్రీరామకోటీ భక్త సమాజం ధార్మిక సంస్థ వ్యవస్థాపకుడు రామకోటీ రామరాజు ఆధ్వర్యంలో సోమవారం వర్గల్ మండలం చాంద్‌ఖాన్‌మక్తా గ్రామంలో కోటీ తలంబ్రాల దీక్ష కార్యక్రమం నిర్వహించారు. భద్రాద్రి రామయ్య కల్యాణానికి రాష్ట్రం నుంచి 250 కిలోల గోటి తలంబ్రాలు అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని రామకోటీ రామరాజు ఈ సందర్భంగా తెలిపారు.

సాగునీరు అందించాలి : సీపీఎం

చేర్యాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : తుపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నింపి చేర్యాల ప్రాంతంలోని చెరువులు, కుంటలకు నీటిని మళ్లించి రైతాంగానికి సాగునీరందించాలని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి కోరారుల. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎండినపంటలకు పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ చేర్యాల పట్టణంలోని పాతబస్టాండు వద్ద జనగామ-సిద్దిపేట జాతీయప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి

దుబ్బాక/మిరుదొడ్డి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : దుబ్బాకలోని రేణుకాఎల్లమ్మ ఆలయ సమీపంలో ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే.. దుబ్బాక మండలం పోతవరం గ్రామానికి చెందిన నిఖిల్(27) బైక్ మెకానిక్‌గా పనిచేసేవాడు. ఆదివారం మండలంలోని పెద్దగుండవెల్లి ఎల్లమ్మ ఆలయానికి బంధువుల దావత్‌కు వెళ్లాడు. అక్కడే భోజనం చేసి దుబ్బాకకు వచ్చాడు. రేణుకాఎల్లమ్మ ఆలయం వెనకాల మర్రిచెట్టు వద్ద అనుమానస్పదంగా మృతిచెంది కనిపించాడు. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్ఐ గంగరాజు చెప్పారు.

వివాహిత అదృశ్యం



కాలువ లైలా(ఫైల్)

కుకునూరుపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం వచ్చిన వివాహిత అదృశ్యమైన ఘటన కుకునూరుపల్లిలో చోటుచేసుకున్నది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహా ముత్తారం మండలం కోరుకుంట్ల గ్రామానికి చెందిన కాలువ రాజేష్, భార్య లైలా(27) బతుకుదెరువు కోసం కుకునూరుపల్లిలోని శ్రీలక్ష్మి హోటల్‌లో గత నెలలో పనిలో చేరారు. అదే నెల 28వ తేదీన ఉదయం భర్త రాజేష్ కాలకృత్యాల కోసం బయటకి వెళ్లి వచ్చేలోగా లైలా కనిపించలేదు. భర్త చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. బంధువుల వద్ద, ఇతర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియలేదు. తన భార్య అదృశ్యంపై కనకు సుమన్‌పై అనుమానం ఉన్నదని సోమవారం రాజేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వీరికి ఇద్దరు సంతానం కాగా, పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఆరు గొర్రెలు మృతి

తొగుట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లారెడ్డిపేట గ్రామంలో విద్యుదాఘాతంతో ఆరు గొర్రెలు మృతిచెందిన సంఘటన సోమవారం చోటుచేసుకున్నది. బాధితుడు కనికి ఎల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కేబుల్ టీవీ వైరు గొర్లషెడ్ రేకులకు తగలడంతోనే విద్యుదాఘాతానికి గురై ఆరు గొర్రెలు మృతిచెందాయి. రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ దేవునూరి పోచయ్య కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న వైకుంఠం

సిద్దిపేట కల్చరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కళారంగంలో చేసిన సేవలకు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర విభాగం అధ్యాపకుడు వైకుంఠం జర్మనీ ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ అవార్డు కార్యక్రమం పాండిచ్చేరిలో యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ పీఎస్ కౌన్సిల్ జర్మనీ కాన్ఫరెన్స్‌లో జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సునీత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడి, అధ్యాపక బృందం తదితరులు వైకుంఠంను అభినందించారు.

పిడిశెట్టికి పీవీ నరసింహారావు సేవారత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న పిడిశెట్టి రాజు

కోహెడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామానికి చెందిన పిడిశెట్టి రాజుకు తెలుగు వెలుగు సాహితి వేదిక పీవీ నరసింహారావు సేవారత్న అవార్డును అందజేసింది. పిడిశెట్టి రాజు చేసిన సేవలకు గుర్తించి ఉగాది పురస్కారాల సందర్భంగా ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. హుస్నాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నటులు ఆర్ఎస్ నంద, సీతామాలక్ష్మి చేతుల పురస్కారాన్ని అందుకున్నారు.

హోమియోపతి ఆధ్వర్యంలో వైద్య శిబిరం

వర్గల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : వర్గల్‌లోని మహాత్మ జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ కళాశాలలో హంస హోమియోపతి వైద్యశాల ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. మైగ్రేన్ తలనొప్పితో బాధపడుతున్న విద్యార్థులకు చికిత్స అందించారు. ఒత్తిడితో తలనొప్పి వస్తుందని, సరైన సమయానికి నిద్రపోవడం, భోజనం చేయడం, తగిన మోతాదులో తాగునీటిని తాగాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం బాస్కర్, వైస్ ప్రిన్సిపాల్ గోవిందరావు, కళాశాల హెల్త్ సూపర్‌వైజర్‌లు ఉమారాణి, సౌజన్య, ఎన్ఎస్ఎస్ విభాగం భాగ్యలక్ష్మీ, డాక్టర్ రాధారాణి పాల్గొన్నారు.

'మా గల్లీకి సీసీ రోడ్డు వేయండి'



నిరసన తెలుపుతున్న మహిళలు

చేర్యాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : తమ గల్లీలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలోని ఏడో వార్డులో మహిళలు సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ తమ వార్డులో ప్రధాన ప్రదేశంలో కాకుండా ప్రయోజనం లేని చోట నిర్మించడం తగదన్నారు. చినుకుపడితే చిత్తడిగా మారి నడవడానికి ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన హామీ మేరకు సీసీ రోడ్డు నిర్మించాలని, లేదంటే స్థానిక సంస్థల ఎన్నికలలో నాయకులను వార్డుకు రాకుండా అడ్డుకుంటామన్నారు.

అక్రమాలకు తావు లేకుండా చూడాలి

మద్దూరు/ధూళిమిట్ట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం పేదలకు అందించే సన్న బియ్యం సరఫరాలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా చూడాలని మద్దూరు, ధూళిమిట్ట తహసీల్దార్‌లు ఏజీ రహీం, మధుసూధన్ డీలర్లకు సూచించారు. సోమవారం మద్దూరు, ధూళిమిట్టలో రేషన్‌డీలర్లతో నిర్వహించిన సమావేశంలో సూచనలు చేశారు. ఉగాది నుంచి ప్రభుత్వం సన్నబియ్యం అందిస్తుందని, ప్రజలకు తెలిసేలా డీలర్లు రేషన్‌షాపుల వద్ద నేమ్ బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

రాజీవ్ రహదారిపైనే బేరాలు

● మార్కెట్ వద్ద దళారుల ఇష్టారాజ్యం

● వాహనాలకు తీవ్ర అంతరాయం





మార్కెట్ ఎదుట రైతుల వాహనాలు రద్దీ, రాజీవ్‌రహదారిపై ట్రాఫిక్‌జామ్

ములుగు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి రామగుండం వెళ్లే రహదారి 24 గంటలూ వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డుపై వెళ్లేవారు వంటిమామిడి మార్కెట్ వద్ద ఆగాల్సిందే. ఇక్కడ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ట్రాఫిక్ జామ్ తప్పడం లేదు.

ములుగు మండలం వంటిమామిడిలోని కూరగాయల మార్కెట్ నిత్యం అమ్మకాలు, కొనుగోలుదారులతో రద్దీగా ఉంటుంది. ఈ మార్కెట్‌కు గజ్వేల్, సిద్దిపేట, జగదేవ్‌పూర్, కొండపాక, దౌల్తాబాద్, తొగుట, కొల్తూరు, మూడు చింతలపల్లి, నారాయణపూర్, తుర్కపల్లి తదితర ప్రాంతాల నుంచి రైతులు బైకులు, ఆటోలపై కూరగాయలు తీసుకువస్తుంటారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని వ్యాపారులు రోజూ ఇక్కడికి వచ్చి కూరగాయలను కొనుగోలు చేస్తారు. రైతులు తెచ్చిన కూరగాయలను మార్కెట్‌లోకి రాకముందే అడ్డుగా ఉండి రోడ్లపైనే బేరాలు చేస్తున్నారు. రైతుల వాహనాలు రాజీవ్‌రహదారిపైనే నిలిచిపోతున్నాయి. దీంతో ట్రాఫిక్‌జామ్ తలెత్తుతున్నది. హైదరాబాద్ నుంచి సిద్దిపేట వైపు వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, పోలీసులు చొరవ తీసుకొని రైతులు తెచ్చిన కూరగాయలు మార్కెట్‌లోనే విక్రయించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

పంటలు దెబ్బతిన్నా ప్రభుత్వం స్పందించదా?

● మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్





బెజ్జంకిలో పంటను పరిశీలిస్తున్న రసమయి బాలకిషన్, గజ్వేలలో పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

బెజ్జంకి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : చేతికొచ్చిన పంటలు దెబ్బతిన్నా ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆవేదన వ్యక్తం చేశారు. బెజ్జంకి మండలంలో అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను సోమవారం ఆయన బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రసమయి మాట్లాడుతూ అకాల వర్షంతో దెబ్బతిన్న పంటలను స్థానిక ఎమ్మెల్యే సత్యనారాయణ పరిశీలించకపోవడం బాధాకరమన్నారు. రైతులకు ప్రభుత్వం పంట నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్ గుప్తా, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

ఫసల్ బీమాను అమలు చేయాలి

గజ్వేల్ రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్ బీమాను రాష్ట్రంలో అమలు చేయాలని కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి దాసరి ఏగొండ డిమాండ్ చేశారు. గజ్వేల్‌లో వడగండ్ల వానతో నష్టపోయిన కె.నర్సింహులకు చెందిన మొక్కజొన్న పంటను బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో పరిశీలించారు. అనంతరం దాసరి ఏగొండ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకమైన ఫసల్ బీమా యోజనను రాష్ట్రంలో అమలు చేయకపోవడంతో రైతులకు నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వమైన అమలు చేయాలని కోరారు. రైతుకు ఎకరానికి రూ.40,000 నష్టపరిహారంగా అంచనా వేసి వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు యెల్లు రామిరెడ్డి, మాదాడి జశ్వంత్‌రెడ్డి, పిడిచెడు వెంకట్‌రెడ్డి మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు మేక ఉమ, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులు పాలకొల్లు వెంకటరామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేలవాలిన మొక్కజొన్న

తొగుట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఘనపూర్ శివారు తుక్కాపూర్‌కు చెందిన రైతు చిక్కుడు ఉప్పలయ్యకు చెందిన మొక్కజొన్న పంట నేలవాలింది. రెండెకరాల భూమిని కౌలుకు తీసుకుని పంటను సాగుచేశానని, ఈదురుగాలుల వర్షానికి నేలవాలిందని వాపోయాడు. ప్రభుత్వం ఆదుకుని ఆర్థిక సహాయం అందించాలని బాధిత రైతు కోరారు.